

మదర్‌థెరిసాకు నీరాజనం

నెహ్రూనగర్(గుంటూరు): గుంటూరు దయాసీస్ సోషల్ సర్వీసెస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం మదర్ థెరిసా వర్ధంతిని నిర్వహించారు.



విజిలెన్స్ తనిఖీలు

నగరంపాలెం(గుంటూరు): ఓబులనాయుడుపాలెం శ్రీరామ్ ఆగ్రోకెమికల్ ఇండస్ట్రీలో మంగళవారం విజిలెన్స్ తనిఖీ జరిగింది. గడువు తీరిన రూ.3.77 లక్షల మందులు సీజ్ చేశారు.



కృష్ణాష్టమి వైభవం

దాచేపల్లి : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణాలంకారంలో అలరించారు.

గురుతర బాధ్యత

- సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులు
- గురువులను గౌరవించడం మన ధర్మం
- కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఉద్ఘాటన
- అట్టహాసంగా ఉపాధ్యాయ దినోత్సవ జిల్లాస్థాయి కార్యక్రమం
- 23 మందికి ఉత్తమ పురస్కారాలు



గుంటూరు సుబ్బారెడ్డి నగర్ ఎంజీపీఎస్ పాఠశాల ఎస్‌జీటీ కె.శివశంకర్ ప్రసాద్‌ను పురస్కారంతో సత్కరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి చిత్రంలో ఎమ్మెల్యే గిరిధర్, మేయర్ మనోహర్, ఆప్కో చైర్మన్ చిరంజీవి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులని, వారిది గురుతర బాధ్యతని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంత్యుత్సవం సందర్భంగా మంగళవారం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మార్కెట్ సెంటర్లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జిల్లాస్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో అందరి మన్ననలు పొందిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశంలోనే అత్యున్నతమైన రాష్ట్రపతి పదవిని అలంకరించారని కొనియాడారు. ఆధునిక కాలంలో గురువులకు ఉండాల్సిన లక్షణాలపై డాక్టర్ రాధాకృష్ణన్ ఎంతో ముందు చూపుతో గ్రంథాన్ని రచించారని, దానిని ప్రతిఒక్క ఉపాధ్యాయుడూ చదవాలని సూచించారు. తల్లిదండ్రుల ఆలోచనా ధోరణి మారిందని, రెండున్నర దశాబ్దాలుగా విద్యార్థులను మార్కులు, ర్యాంకుల పేరుతో కొన్ని కోర్సులకే పరిమితం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్న తాభ్యాసాలు సులువుగా అందుకోగలుగుతున్నా.. విలువలు కోల్పోయే పరిస్థితి నెలకొందని వివరించారు. విద్యతోపాటు నైతిక విలువలను ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు.

దేశానికి రాజైనా ఓ గురువు చెక్కిన శిల్పమే

సభాధ్యక్షుడు ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ దేశానికి రాజైనా ఓ గురువు చేతిలో రూపుదిద్దుకున్న శిల్పంలాంటివారేనని పేర్కొన్నారు. విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్షర యజ్ఞం చేపట్టారని, దీనివల్ల పేద వర్గాల పిల్లలు పైసా ఖర్చు లేకుండా ఇంగ్లిష్ మీడియం చదువులను ఉచితంగా పొందుతున్నారని వివరించారు. మనబడి నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ వసతులను సంతరించుకున్నాయని ఆనందం వ్యక్తం చేశారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా

గురుదేవోభవ

పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు మాట్లాడుతూ గురువు దైవంతో సమానమని, అందుకే మన పూర్వీకులు గురుదేవోభవ అని నినదించారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ కృషితో రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థ అభివృద్ధి పథంలో పయనిస్తోందని తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ విద్యను ఉన్నతస్థాయికి తీసుకెళ్లిన సీఎం వైఎస్ జగన్ గురువులకు సముచిత స్థానం కల్పించారని కొనియాడారు. కార్యక్రమంలో ఇంకా డెప్యూటీ మేయర్ షేక్ సజిల, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, డీఈఓ పి.శైలజ, సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి తదితరులు ప్రసంగించారు. గురువులతో తమ అనుబంధాన్ని పంచుకున్నారు.

ఆకట్టుకున్న స్వాగత నృత్యం

ముందుగా శారదానికేతన్ విద్యార్థినులు చేసిన స్వాగత నృత్యం ఆహూతులను అమితంగా ఆకట్టుకుంది. అనంతరం అతిథులు 23 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, జెడ్పీటీసీ సభ్యులు గుల్జార్ బేగం, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ జానీ సాహెబ్, కృష్ణ బలిజ–పూసల సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ కె.భవానీ మణికంఠ, కుమ్మరి–శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండెపూడి పురుషోత్తం, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, గుంటూరు డీవైఈఓ ఎం.వెంకటేశ్వరరావు, ఎంఈవోలు పి.వెంకటేశ్వరరావు, జ్యోతికిరణ్, వాఖ్యాత ఏవీ సుజాత, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సులకు స్పాట్ కౌన్సెలింగ్



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల ప్రవేశాలకు మంగళవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మిదేవి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న, చేయని విద్యార్థులను కూడా స్పాట్ కౌన్సెలింగ్‌కు అనుమతించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, పాలిటెక్నిక్ డైరెక్టర్ ఎం.రేఖ తదితరులు పాల్గొన్నారు.

యార్డులో 38,258 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 36,310 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 38,258 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.25,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.22,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి రూ.24,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,495 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. ఫార్మాసిస్టు ఉద్యోగాలు ఎనిమిది, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలు రెండు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు నాలుగు, ఎల్‌జీఎస్ ఉద్యోగాలు తొమ్మిది భర్తీ చేస్తామన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు పూర్తి వివరాల కోసం గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను సదరు వెబ్‌సైట్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత ధ్రువ పత్రాలతో డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

మెడికల్ ఆఫీసర్ పోస్టుకు వాక్ ఇన్..

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో ఒక కాంట్రాక్టు మెడికల్ ఆఫీసర్ పోస్టు భర్తీ చేసేందుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ జరుగుతుందన్నారు. విద్యార్హత, వేతనం, దరఖాస్తు ఫారాల కోసం గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారిగా మూర్తి



బాపట్ల అర్బన్: బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారిగా ఏవీఎస్ఎస్ మూర్తి నియమితులయ్యారు. ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తూ బాపట్లకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న కె.లక్ష్మీశివజ్యోతి నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.5,000, గరిష్ట ధర రూ.8,000, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.



కొత్త పింఛన్‌దారులతో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది (ఫైల్)

కానుకలు కురిపింఛన్

- జిల్లాలో 13,815 కొత్త పెన్షన్లు
- జిల్లాకు రూ.72.6 కోట్లు కేటాయింపు
- పంపిణీ గడువు 10వ తేదీ వరకు పొడిగింపు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గత ప్రభుత్వ హయాంలో పింఛన్ మంజూరు కావాలంటే శత కోటి నిబంధనలు. అన్ని అర్హతలూ ఉన్నా.. జన్మభూమి కమిటీల ఆమోదం పొందాలి. ఆ కమిటీలు తమ పార్టీ సానుభూతిపరులకు, భజన బృందాలకు మాత్రమే పెన్షన్లు మంజూరు చేసేవి. కానీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారింది. అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా పింఛన్లు, సంక్షేమ పథకాలు మంజూరవుతున్నాయి. ఇంటింటా సంతోషాలు విరబూస్తున్నాయి. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదని, కులం, మతం, పార్టీ చూడకుండా లబ్ధి చేకూర్చాలని తలంచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే తొలిసారిగా వార్డు/గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. ఎవరి సిఫార్సులకు తావు లేకుండానే ఎంపిక విధానాన్ని సులభతరం చేశారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం ద్వారా లబ్ధిదారులకు ప్రతినెలా ఒకటో తేదీ వేకువజామునే నేరుగా ఇంటికే వెళ్లి నగదు అందించేలా చర్యలు చేపట్టారు.

మొత్తం పెన్షన్ల సంఖ్య 2,65,105

ప్రభుత్వం ప్రతి ఆరునెలలకోసారి కొత్త పెన్షన్లు మంజూరు చేస్తుంది. 5 నెలల క్రితం పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అర్హతలను బట్టి ఈనెలలో మంజూరు చేసింది. గుంటూరు జిల్లాలో గతంలో 2,51,290 పింఛన్లు ఉండగా, కొత్తగా 13,815 మంజూరయ్యాయి. దీంతో మొత్తం సంఖ్య 2,65,105కు చేరింది. మొత్తం పింఛన్ల కోసం ప్రభుత్వం రూ.72.6 కోట్లు కేటాయించింది. గతంలో కంటే రూ.రెండు కోట్ల అదనపు భారం భరిస్తోంది. ప్రతినెలా పింఛన్ల పంపిణీ 5వ తేదీతో ముగుస్తుంది. కొత్తగా మంజూరైన పింఛన్‌దారులందరికీ నగదు అందాలనే ఉద్దేశంతో ఈనెల సర్కారు పంపిణీ గడువును పెంచింది.

ఎవరి సిఫార్సు లేకుండానే పింఛన్



నాకు ఈనెల నుంచి కొత్తగా పింఛన్ మంజూరైంది. నేను ఏ కార్యాలయానికీ వెళ్లలేదు. ఏ నాయకుడి సిఫార్సు కోరలేదు. వలంటీరే మా ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించి పింఛన్ మంజూరు చేయించారు. ఈనెల రూ.2,750 అందజేశారు. సీఎం జగన్ బాబుకు ధన్యవాదాలు

– షేక్ ఆదాంబీ, స్తంభాలగరువు

అందరికీ పింఛన్లు అందాలనే..

గుంటూరు జిల్లాలో కొత్తగా 13,815 పింఛన్లు మంజూరయ్యాయి. అందరికీ వైఎస్సార్ పెన్షన్ కానుక నగదు అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈనెల 10వ తేదీ వరకు పంపిణీ గడువును పెంచింది. పదో తేదీ వరకు వలంటీర్లు పింఛన్లు అందిస్తారు.

– వై.హరిహరనాథ్, డీఆర్‌డీఏ పీడీ





గురువర్యా.. వందనం

గుంటూరు జిల్లా అధ్యాపకులు ఇద్దరు రాష్ట్రస్థాయి ఉత్తమ గురువులుగా మెరిశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. గుంటూరు జీజీహెచ్, మెడికల్ కళాశాల న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి, చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు అవార్డులు అందుకుంటున్న దృశ్యాలను చిత్రాల్లో చూడొచ్చు. – గుంటూరు మెడికల్/గుంటూరు రూరల్

9న జాతీయ లోక్ అదాలత్

గుంటూరు లీగల్: ఈనెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్, ఎన్ఐ యాక్ట్, మోటార్ వాహన ప్రమాద బీమా, కార్మిక వివాదాల కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న కేసులను ఆయా మండల కేంద్రాల్లో, గుంటూరు కోర్టుల్లో ఉన్న కేసులను జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించనున్నట్లు చెప్పారు. జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పార్థసారథి కోరారు.

55 ఎకరాల్లో పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్లు

- గతంలో ఏ ప్రభుత్వం ఇంతటి మేలు చేయలేదు
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన వరమిది
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

తాడేపల్లి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వాలు చేయలేని పనులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తోందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) స్పష్టం చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలో 55 ఎకరాల్లో ఇళ్లు నిర్మించుకుని ఉన్న పేదలకు రిజిస్ట్రేషన్లు చేసేందుకు అన్ని చర్యలూ చేపట్టిందని వివరించారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులతో ఆర్కే సమీక్ష నిర్వహించారు. తాడేపల్లిలోని 201 సర్వే నంబర్‌లోని భూములను గత ప్రభుత్వం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయిందని, అప్పటి నుంచి స్థానికంగా నివాసం ఉండే వారు తమ ఇళ్ల రిజిస్ట్రేషన్లు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే రిజిస్ట్రేషన్ ప్రకియ యథావిధిగా జరిగేలా చేస్తామని హామీ ఇచ్చామని, దీనిలో భాగంగానే 13.20 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే తెలిపారు. అలాగే తాడేపల్లి కొండ చుట్టూ ఉన్న మరో 42 ఎకరాల భూముల్లో పేదలు ఇళ్లు కట్టుకుని ఉంటున్నారని, వీరి ఇళ్ల రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం మార్గం సుగమం చేసిందని వివరించారు. తాడేపల్లి 201 సర్వే నంబర్‌లో సుమారు 1,120 మందికి రిజిస్ట్రేషన్లు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి, డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, ఏసీపీ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, యువజన నాయకులు మహేష్, వివేకానందరెడ్డి, మేకల సాంబశివరావు, బాజీ గంగాధర్, మేకా వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు

- ఒకరి మృతి
- 14 మందికి గాయాలు
- పార్వతీపురం నుంచి గుంటూరు వస్తున్న బస్సు

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): జాతీయ రహదారిపై నక్కపల్లి సమీపంలో ఆగి ఉన్న లారీని సోమవారం అర్ధరాత్రి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. 14 మందికి తీవ్రగాయాలయ్యాయి. డ్రైవరు అతి వేగంగా బస్సును నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్వతీపురం నుంచి గుంటూరు వెళ్తున్న సాయికృష్ణ ప్రైవేటు ట్రావెల్ బస్సులో సుమారు 40 మంది ప్రయాణిస్తున్నారు. వీరంతా వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేందుకు పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లిలలో బస్సు ఎక్కారు. బస్సు అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో నక్కపల్లి దాటిన తర్వాత కిలోమీటరు దూరంలో మనబానవానిపాలెం రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. అనకాపల్లిలో జరిగిన వివాహానికి హాజరై తిరిగి వెళ్తున్న విజయవాడ సమీపంలో గొల్లపూడి గ్రామానికి చెందిన బైపాన రమేష్ (35) బస్సులోనే చిక్కుకుని అక్కడికక్కడే మరణించాడు. ఆయన భార్య బైపాన కుమారి, కుమారుడు మోక్షిత్ (ఆరు నెలలు)తోపాటు 14 మంది గాయపడ్డారు. బస్సు ముందు భాగంలో కూర్చున్న రమేష్ సీట్లో ఇరుక్కుని అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లలో నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్వల్పంగా గాయపడిన వారిని ప్రాథమిక చికిత్స అనంతరం వారి ప్రాంతాలకు పంపించారు. ఆరు నెలల మోక్షిత్ తలకు బలమైన గాయాలయ్యాయి. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు.


కార్యక్రమంలో అలరించిన విద్యార్థినుల నృత్యరూపకం


అవార్డు అందుకుంటున్న ఎ.శివరామకృష్ణ, సంగం జాగర్లమూడి


వద్దిపాటి వీరరాఘవరావు నిడుబ్రోలు


నూతలపాటి విజయలక్ష్మి వేజెండ్ల


గోవర్తి పాప నల్లపాడు


పనిదారపు శ్రీనివాసరావు కొర్రపాడు


దివాకరుని నాగభారతి అంకిరెడ్డిపాలెం


కోడె జ్ఞానప్రసాద్ నల్లపాడు


ఎండీ అన్వర్ సాధిక్ కొర్నెపాడు

గురుభ్యో నమః

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మంగళవారం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డులు స్వీకరించారు. తొలుత విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. – గుంటూరు


అలవాల శ్రీనివాసరావు నారాకోడూరు


కె.నరేంద్రకుమార్ చినలింగాయపాలెం


అవార్డు అందుకుంటున్న తడివాక శ్రీదేవి, నిడమర్రు


షేక్ అస్మతున్నిసా తెనాలి


దాసరి నాగవేణి కవెవరం


బీఎస్ఎస్ గోపాలరావు గుంటూరు


సయ్యద్ అబ్దుల్ కరీం గుంటూరు


బి.వెంకటేశ్వరరావు తెనాలి


పుల్లగూర రమాదేవి బండారుపల్లి


పి.సౌజన్య తెనాలి


మొర్ల కృష్ణ గుడివాడ


షేక్ నూర్జహాన్ కొల్లిపర


యేనుగుంటి రమా గుంటూరు


మాదాల ఇందిర గుంటూరు

ఉత్తమ ఉపాధ్యాయులకు సమాజంలో గౌరవం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్
- పార్టీ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయులకు సత్కారం

నగరంపాలెం: సమాజంలో మంచి ఉపాధ్యాయులకు చాలా గౌరవం ఉంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ గుంటూరు జిల్లా, ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించి, మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల విద్యాబోధన, ఆలోచనలు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతాయని పేర్కొన్నారు. తద్వారా మంచి భావాలు, ఆలోచనలు, విద్యాబుద్ధులను కలిగి ఉంటారని పేర్కొన్నారు. తద్వారా నిత్య జీవితంలో వారికి మంచి గౌరవం లభిస్తుందని అన్నారు. గురు, శిష్యుల సంబంధాలు సమాజ ప్రగతిని సృష్టిస్తాయని చెప్పారు. విద్య, ఉపాధ్యాయులు, గురువుల పాత్ర చాలా ప్రభావితమైనవని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ గురువుల బోధనల వల్లే మంచి పౌరులుగా మారతారని అన్నారు. మంచి విద్యా బోధన, నడవడికతో సమాజంలో మంచి పౌరులుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వైఎస్ఆర్‌టీఎఫ్ అధ్యక్షుడు థామస్‌రెడ్డి, గుంటూరు తూర్పు సమన్వయకర్త నూరిఫాతిమా, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, నాయకులు ముత్యం, కార్పొరేటర్ స్మిత పద్మజ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, వర్సిటీ అధికారులు

ఏఎన్‌యూ: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించి, సంపూర్ణ పౌరులుగా రూపొందించి సమాజానికి అందించాలని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అధ్యాపకులకు సూచించారు. యూనివర్సిటీ అధ్యాపక సంఘం(నూటా) ఆధ్వర్యంలో మంగళవారం యూనివర్సిటీలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసంగిస్తూ ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులుగా ఉంటేనే పరిపూర్ణత చేకూరుతుందన్నారు. మారుతున్న పరిస్థితులు, సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా అధ్యాపకులు కొత్త అంశాలను అధ్యయనం చేసి విద్యార్థులకు అందించాలన్నారు. విద్య, పరిశోధన, అధ్యయనం వంటి అంశాలలో అధ్యాపకులు ఎప్పుడూ విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలన్నారు. సమాజాభివృద్ధికి దోహదం చేసే పరిశోధనలను అధ్యాపకులు ప్రోత్సహించాలన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉన్నత ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రెక్టార్ ఆచార్య వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, నూటా అధ్యక్షుడు డాక్టర్ బి.నాగరాజు, ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, ఆచార్య కె.గంగాధర్, ఆచార్య ఇ.శ్రీనివాసరెడ్డి ప్రసంగించారు. నూటా నాయకులు, యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్జీరంగా వర్సిటీలో ...


మాట్లాడుతున్న వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి

గుంటూరు రూరల్: అధ్యాపకులు అంకితభావంతో పనిచేస్తూ విశ్వవిద్యాలయ అభ్యున్నతికి తోడ్పడాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం లాంఫాం నందున్న వర్సిటీ పరిపాలన భవనంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ క్రమశిక్షణతో కూడిన అత్యున్నత విలువలు కలిగిన ఆదర్శప్రాయుడని తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, అగ్రికల్చర్ డీన్ డాక్టర్ పి.సుధాకర్, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఎ.మణి, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, కంప్ట్రోలర్ డాక్టర్ ఏవీ రమణ, ఎస్టేట్ ఆఫీసర్ డాక్టర్ పి.రవి పాల్గొన్నారు.

ప్రాధాన్యతా రంగాలకు రుణాలిచ్చి ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: ప్రాధాన్యతా రంగాలను ప్రోత్సహించే విధంగా బ్యాంకర్లు రుణాలిస్తే ఉపాధిమార్గాలు పెరగడంతోపాటు ఆర్థిక వృద్ధి పెరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ మీటింలో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా రైతులు, పారిశ్రామిక వేత్తలు, చిరు వ్యాపారులను ప్రోత్సహించాలని కోరారు. జిల్లాలో అత్యధిక శాతం పంటలు సాగు చేస్తున్నది కౌలు రైతులేనన్నారు. వారికి రుణాలిచ్చే క్రమంలో తగిన ప్రాధాన్యతనివ్వాలన్నారు. వ్యవసాయ శాఖాధికారులు ఎప్పటికప్పుడు దీనిపై రివ్యూ నిర్వహించాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఆశించిన స్థాయిలో గృహ, విద్యారుణాలివ్వలేదన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించి రుణాల మొత్తాలను, సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. చిరు వ్యాపారుల పెట్టుబడి కోసం అందిస్తున్న జగనన్న తోడు రుణాలను పెండింగ్ లేకుండా విడుదల చేయాలని చెప్పారు. అడవి తక్కెళ్ల పాడు, వెంగళాయపాలెం టిడ్కో గృహాల లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ రుణాలు 15 రోజుల్లో అందించాలన్నారు. గ్రామీణ యువత పాధి కోసం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణలో డిమాండ్ ఉన్న మార్గాలను అన్వేషించాలన్నారు. ప్రస్తుతం మార్కెట్ స్థితిగతులు మారిపోతున్నాయని, స్కిల్డ్ లేబర్ కోసం కంపెనీలు చూస్తున్నాయని చెప్పారు. బ్యాంకర్లు, ప్రభుత్వం కలిసి పనిచేస్తేనే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. బ్యాంకర్లకు ఎటువంటి ఇబ్బందులున్నా వెంటనే తనను సంప్రదించాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ మహీపాల్ రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం విజయరత్నం, యూనియన్ బ్యాంక్ ఏజీఎం అశ్వత్ నాయక్, ఆర్బీ ఏజీఎం ఆర్‌కే హనుమ కుమారి, నాబార్డ్ డీడీఎం జి.శరత్ బాబు, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

రూ.1.44 కోట్లతో మంచినీటి పథకం

ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్


మంచినీటి పథకం ప్రాజెక్టును ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: గ్రామంలోని ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రూరల్ మండలం కొలకలూరు ఎస్సీ కాలనీలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.1.44కోట్లతో ఏర్పాటు చేసిన మంచినీటి పథకం ప్రాజెక్ట్‌ను మంగళవారం ఎమ్మెల్యే శివకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికి శాశ్వతంగా శుభ్రమైన తాగునీరు అందిస్తామన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది, అధికారులు, వలంటీర్లతో కలసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. సైడు కాల్వలు ఏర్పాటు చేయాలని, రోడ్లకు కల్వర్టులు నిర్మించాలని, ఇళ్ల స్థలాలు ఇప్పించాలని ప్రజలు కోరారు. రెండు నెలల్లో అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే వారికి తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1.80లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ ఎస్ఈ జి.బ్రహ్మయ్య, డీఈ గుప్తా, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, వైస్ ఎంపీపీ కోడూరి స్వప్న, ఎంపీటీసీలు నాగదేవిక, ఫణికుమార్, డీసీఎంఎస్ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, పార్టీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

5 రోజుల్లో 30శాతం మందికి రేషన్ పంపిణీ

నరసరావుపేట: జిల్లాలో ఆహార భద్రత కింద పేదలకు ప్రతి నెలా అందజేసే ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ ముమ్మరంగా జరుగుతోంది. ఈనెల ఒకటి నుంచి ఐదవ తేదీ మంగళవారం సాయంత్రానికి 30 శాతం మంది లబ్ధిదార్లకు రేషన్ బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు, గోధుమ పండి పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 1289 రేషన్‌షాపుల ద్వారా 402 ఎండీయూ వాహనాల సహాయంతో ఇంటింటికీ నిర్వహిస్తున్న నిత్యావసర సరుకులు 6,32,806 కార్డులకు పంపిణీ చేయాల్సివుండగా 1,94,248మందికి పంపిణీ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ వెల్లడించారు. వీరిలో పంచదార 1,59,986మందికి, కందిపప్పు 3,958 మందికి ఇవ్వగా పట్టణ ప్రాంతాల్లోని లబ్ధిదార్లకు పంపిణీ చేస్తున్న ఫోర్టిఫైడ్ ఆటా 35,051మందికి అందజేశారు. ఈనెల 17వ తేదీ నాటికి జిల్లాలోని లబ్ధిదార్లందరికీ ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తామని డీఎస్ఓ వెల్లడించారు.

గురుశిష్యులు ఇద్దరూ గెజిటెడ్ ఆఫీసర్లే..!

- గురువు సబ్ ట్రెజరీ అధికారి కాగా.. శిష్యుడు వినుకొండ తహసీల్దార్
- గురు పూజోత్సవం సందర్భంగా సత్కరించి, ఆశీస్సులు అందుకున్న వైనం


తన గురువు సబ్ ట్రెజరీ అధికారి అజ్మల్లాను సత్కరిస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

వినుకొండ(నూజెండ్ల): గురుపూజోత్సవం సందర్భంగా వినుకొండ తహసీల్దార్ కార్యాలయంలో అరుదైన సంఘటన చోటు చేసుకుంది. వినుకొండలో పక్కపక్క కార్యాలయాల్లో పనిచేస్తున్న గురుశిష్యులు ఇద్దరూ గెజిటెడ్ హోదాలో ఉన్నారు. ఒకరు సబ్ ట్రెజరీ అధికారి అజ్మల్లా, మరొకరు వినుకొండ తహసీల్దార్ కిరణ్‌కుమార్. అయితే సబ్ ట్రెజరీ అధికారి గతంలో నరసరావుపేటలో టీచర్‌గా పనిచేస్తున్న సమయంలో ప్రస్తుత తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఆయన వద్ద విద్యను అభ్యసించారు. గురుభక్తితో అజ్మల్లాను తహసీల్దార్ కార్యాలయానికి ఆహ్వానించి దుశ్శాలువా, పూలమాలలతో గౌరవించి ఆశీస్సులు అందుకున్నారు. చదువు చెప్పిన గురువును సత్కరించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఇద్దరూ పక్కపక్క కార్యాలయాల్లో పనిచేస్తూ ఉన్నప్పటికీ వారిరువురు గురుశిష్యులని ఎవరికీ తెలియదు. అయితే గురుపూజోత్సవం రోజున గురువును సత్కరించిన విషయం తెలిసి, తహసీల్దార్‌ను సిబ్బంది అభినందించారు.

సమగ్ర భూ సర్వేతో వివాదాలు పరిష్కారం


ఆర్డీఓ, తహసీల్దార్‌లకు సూచనలిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

అచ్చంపేట: సమగ్ర భూ సర్వే ద్వారా దశాబ్దాల కాలంగా అపరిష్కృతంగా ఉన్న భూవివాదాలు పరిష్కారమవుతాయన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. థర్డ్ ఫేస్ కింద మండలంలోని గింజుపల్లి, ఓర్వకల్లు, మిట్టపాలెం గ్రామాలలో ఈ నెల 8నుంచి సమగ్ర భూసర్వే చేపట్టినట్లు తెలిపారు. డిసెంబరు చివరి నాటికి మూడు గ్రామాలలో 6 వేల ఎకరాల భూమిని రీ సర్వే చేయవలసి ఉంటుందన్నారు. సర్వే పూర్తయిన తరువాత భూ యజమానుల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. సిబ్బంది వెంటనే కార్యాచరణ చేపట్టి ఆయా గ్రామాలలోఎవ్వరూ వేలెత్తి చూపకుండా భూ వివాదాలకు తావులేకుండా సంపూర్ణ సర్వే చేపట్టాలన్నారు. సమగ్ర భూ సర్వే విధివిధానాలను సర్వేయర్లు, వీఆర్వోలకు వివరించారు.

రైతులంతా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలి...

రైతులంతా వేసిన పంటను ఈ–క్రాప్ చేయించుకోవాలని, అలా చేయించుకుంటేనే విపత్కర పరిస్థితులలో ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. వ్యవసాయ సిబ్బంది రైతులు వేసిన పంటలను నమోదు చేయాలని సూచించారు. మండలంలో కొన్ని గ్రామాలలో ఎత్తిపోతల పథకాలు ఆగిపోయాయని, వాటిని పునరుద్ధరించాలని కోరగా ఎత్తిపోతల పథకాల నిర్వహణలో రైతులు కూడా భాగస్వాములు కావాలన్నారు. అలా అయినప్పుడే ఎలాంటి అవాంతరాలు కలుగకుండా ప్రతి ఎకరాకు సాగునీరు అందుతుందని చెప్పారు. ఆర్డీఓ రాజకుమారి, అచ్చంపేట తహసీల్దార్ పద్మాదేవి పాల్గొన్నారు.